# పిలవని పిలుపు

'నీతిచంద్రిక' లో మూడు చేపల కథ చదివిన తరవాత శంకరానికి ఒక కొత్త విషయం స్ఫురించింది. మనుష్యులు ఎప్పుడూ మూడు రకాలుగా ఉంటారు—జీవితాన్ని గురించి ఆలోచించకుండా చేతికి అందిన పని చేసుకుపోయేవాళ్ళు, ఎంత ఆలోచించినా తీరా సమయం వచ్చే సరికి అప్పటికి ఎంత తోస్తే అంత చేసుకుపోయేవాళ్ళు. మరి కొందరు ఎంతసేపూ ఆలోచించడమే తప్ప ఇంకేమీ చేయలేని వాళ్ళూను. తను ఈ మూడో తరగతికి చెందిన మనిషినని శంకరానికి అవలీలగా తట్టింది.

జీవితంలో పూర్ణాయుర్దాయం వ్రాసి ఉంటే—అలా వ్రాసి ఉండదని అందరకీ ఖచ్చితంగా తెలుసును — తనకు అందులో మూడోవంతు ఇప్పటికే అయిపోయింది. దేశంలో సగటు ఆయుర్దాయం తీసుకుంటే ఇప్పటికే తను బతికి ఉండ నక్కరలేనివాడు అవుతాడు.

కాస్త ప్రపంచ జ్ఞానం వచ్చినప్పటి నుంచి ఆలోచిస్తున్నాడు శంకరం — ఈ జీవితానికి ఏదయినా అర్థం, పరమార్థం దొరుకుతుందేమోనని. ఆలోచించిన కొద్దీ రోజులు మరీ యాంత్రికంగా దొర్లుకుపోతున్నాయి తప్ప ఇంకేం ప్రయోజనం కనిపించడం లేదు.

జీవితంలో సుఖం, ఆనందం కనిపిస్తాయి అందరికీని.

తనకెందుకు అందవు అవి?

అందరికీ గులాబీపువ్వు అందం కనిపిస్తూ ఉంటే తనకు మాత్రం దాని కింద ముల్లుమాత్రమే ఎందుకు కనిపిస్తుంది?

"నీకు జీవితంలో వూహలు ఉన్నాయి తప్ప అనుభవం లేదు" అన్నాడు స్నేహితుడు దామోదరం.

"కావచ్చు.... ఈ వూహలు నా తాహతుకు అతీతమైనవిగా అనిపించడం లేదు నాకు" అని శంకరం సమాధానం చెప్పుతాడు.

"ఏమయినా సమర్థించుకో, శంకరం నువ్వు. కాని, కాగితం మీదకు ఇమడని వూహ—ఆచరణకు రాని ఆలోచన ఎందుకూ పనికి రానిదే!"

"అయితే నన్నేం చేయమంటావు?"

"ఏమీ చేయనక్కర్లేదు. నీలో నీవు ముడుచుకు కూర్చోవడం మానెయ్యి. ప్రపంచంలో తిరగడం నేర్చుకో."

ఈ మాటలు శంకరానికి దబ్బున అర్థం కాలేదు. నెత్తిన పాము పడగ పెట్టినట్లుగ అయింది అతనికి. ఒక్క మారయిన కాటువేయదు. సుఖమో దుఃఖమో తెలిసేట్లు చేయదు!

"నా కర్మం ఏమిటో గాని, ఏదీ నాకు ఉత్సాహం కలిగించదు. పక్కవాడి ఆనందంలో పాలు పంచుకోవడం కూడా నాకు చేత కాదు."

"పక్కవాడితో సామ్యం పెట్టుకోవుగా అందువల్లనే"

"నా కంటే తక్కువ వాళ్ళతో పోలిక పెట్టుకొని నేను చాలా హాయిగా ఉన్నానని తృప్తిపడదామనుకుంటాను. అది గూడా ఎండమావే అయిపోతోంది" అన్నాడు శంకరం.

"నీ కంటే తక్కువ వాళ్ళని నీకు ఎలా తెలుసు?"

శంకరం జవాబు చెప్పలేకపోయినాడు.

"నా కంటే వీడు పెద్దవాడు, వాడు కొద్దివాడు అనే కేటాయింపు చేస్తూంది నీ మనస్సు అంటే — తప్పకుండా దానికి ఏదో సుస్తీచేసిందన్న మాట!"

"నా జీవితం నాదేనని ఒంటిపిల్లి రాకాసిలాగా కూర్చోవటానికి అవుతుందా ఏమిటి?"

"ఏం. ఎక్కువ వాళ్ళతో పోటీ చేసి పైకి ఎగబ్రాకుదాం అనిపించదేం నీకు? — ఎవరినీ సరిపోల్చి చూడకుండా తృప్తిగా ఉండలేవా?"

"మనిషి మరి సంఘ జీవి గదా!"

"అదిగో చూచావా.., నువ్వే చెబుతున్నావు ఆ సంగతి. సంఘజీవిగా మనిషి బాధ్యత ఏమిటి?"

"అబ్బా, నాకు సోషియాలజీ పాఠం చెప్పకు, దామోదరం! కాలేజీలో చదివి చదివి విసుగెత్తి పోయింది గదా. ఇంకా ఎందుకూ?"

"చదువు కాలేజీ గోడలతోనే ఆయిపోదు. ప్రతిక్షణమూ చదువుకుందుకు తయారుగా కూర్చున్న వాడికే జీవితం కొత్త కొత్త పాఠాలు చెబుతుంది."

"సరిపోయింది .. ఫిలాసఫీ చెబుతున్నావు."

"కాదు. ఇది జీవితం రా, శంకరం భాయ్" అన్నాడు దామోదరం.

శంకరానికి తాను మరమనిషినని తెలుసు. కాని, ఈమరకు మనసు కూడా ఉంది.

ఈ మనసు ఏది నిజంగా కావాలనుకుంటుందో కూడా అతనికి తెలుసు.

అన్నీ తెలుసును గనుకనే అజ్ఞానంలో పడలేక కొట్టుమిట్టులాడుతున్నాడు.

కాని, జీవితం చేసే సవాళ్ళు చూస్తే, కొన్నాళ్ళు ఈ అజ్ఞానంలో పడి కొట్టుమిట్టులాడితే గాని, ఆనందం కూడా దొరకకుండా పోతుందా— అనిపిస్తుంది.

ఆనందం కూడా అజ్ఞానానికి లోకువ అయినదేనా?

ఏమో.... తెలియదు.

అన్నీ తెలిసినట్లే అనిపించి, తీరా సమయం వచ్చేసరికి ఏమీ తెలియకుండా పోయే పరిస్థితి తనది.

అందరిలాగ తను కూడా అందరూ నడిచే దారిలో నడుద్దామని, ఆలోచనలన్నీ మూట గట్టి ఒక మూలకు గిరవాటు వేద్దామనీ అనుకుంటాడు.

అందరిలాగ ఉండాలంటే ఏం చేయాలి?

కులమింటి కోతిని పెళ్ళి చేసుకోవాలి.

పండంటి కొడుకుల్నీ, కూతుళ్ళనీ కనాలి.

వంశాన్ని ఉద్ధరించానని అందరి ముందు బోరవిరుచుకు తిరగాలి.

కాని, చూస్తూ చూస్తూ ఈ అగాథంలో పడడం ఎందుకు?

మనసుకే అందని లోతులు మనుషులకు అందుతాయా?

అయిదేళ్ళనించి మేనమామ ఉత్తరం వ్రాస్తూనే ఉన్నాడు. ఆరు నెలల కో పర్యాయం స్వయంగా వచ్చి చెప్పి వెళుతూనే ఉన్నాడు. కాని, శంకరం మనసుకు ఇదంతా సజావుగా, సవ్యంగా ఉన్నట్లుగా తోచదు.

ఎక్కడో పర్వతం కొసకు చేరుకోవలసిన తను మొట్టమొదటికే దిగజారి—నేలమీద, అందునా చదునైన నేలమీద—మట్టిమీద దొర్లుకు పోతున్నాడు.

ఇందులో తన తప్పేంలేదు.

ప్రయత్న లోపం లేదు.

నుదుటి వ్రాత అంతే!

తల్లి, తండ్రి—విష జ్వరంతో పోయినప్పుడు శంకరం తన పి. యు. సి. ని కొండమీదికి ఎక్కించి తను కిందికి దొర్లాడు. వాళ్ళ అకాల మృత్యువు తన మనస్సును వికలంచేసింది. జీవితాలు బుద్బుద ప్రాయాలని తెలుసుకొన్నాడు. ఈ నీటిబుడగలను ఇలాగే చిదికి పోనివ్వక వీటికి ఏవో రంగులు పులమటానికి ప్రయత్నం ఎందుకు?

పార్వతికి ఏదో సంబంధం చూచి పెళ్ళి చేసి వేయమని మేనమామకు చెప్పి చాలా సంవత్సరాలు అయింది. కాని, ఆయన మాట వినడు. ఎప్పుడో చెల్లెలుకు మాట యిచ్చాననంటాడు.

తన చెల్లెలు, బావ చనిపోయారు గనుక శంకరం విషయంలో తన బాధ్యత ఇబ్బడికి ముబ్బడి అయిందంటాడు.

తాను వాళ్ళకు ఇచ్చిన మాట ప్రకారం నడచుకోలేకపోతే, ఆ ఆత్మలకు శాంతి లేకుండా పోతుందంటాడు.

ఈ గందరగోళం మధ్య శంకరం తన ఆత్మకు శాంతి ఎలా దొరుకుతుందో తెలియక కొట్టుమిట్టు లాడుతూ, మధ్యలో 'బహుశ బతికున్నవాళ్ళ ఆత్మలకు అంతగా శాంతి అక్కర్లేదేమో' అనుకున్నాడు. తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు.

మేనమామ పోరు పడలేక అయితేనేం స్నేహితుడు దామోదరం సలహాలకు చెవి వొగ్గి అయితేనేం శంకరం ప్రయాణం కట్టాడు మేనమామ ఉంటున్న కుగ్రామానికి. ఇన్నాళ్ళూ తన ఉద్యోగం వూరు దాటి బయట తిరగలేదు. ఇప్పుడు మేనమామే కాకుండా, ఉద్యోగం కూడా వేధిస్తూ ఉండటంతో పోనీ కాస్త మార్పుగా ఉంటుంది—అనుకున్నాడు.

ఎప్పుడూ ఒకటే పని!

గానుగెద్దుకు, తనకు ఎక్కువ తేడా లేదు. దానికి తన యజమానికి సేవ చేస్తున్నానన్న తృప్తి ఉంటుందేమో!

బస్తీలో జీవితంఅంటే విరాగం కలుగుతోంది.

ఎప్పుడూ ఒకటే బజార్లు.

ఒకటే దుకాణాలు.

ఒకటే పుస్తకాలు.

ఒకటే ఇక్కట్లు.

పల్లెలలో ఇంతగందరగోళం, ఉరుకులు పరుగులు ఉండవనిపించింది. తాపీగా ఆలోచించుకో వచ్చునేమో కూడా. ఇలాంటి ఆలోచనలే అతనికి మనసులో మెదులుతూ ఉన్న సమయంలో మేనమామ "ఎప్పుడూ నీవు మాఇంటి వైపుకయినారావు మేనమామ అన్నవాడు ఒకడు ఉన్నాడనే విషయమే నీకు గమనం ఉన్నట్లు లేదు" అని నిష్ఠూరంగా ఉత్తరం పంపించాడు.

శంకరం ప్రయాణం నిశ్చయం చేసుకున్నాడు.

ఉత్తరం ఇప్పుడు కేవలం సాకు.

ఇదివరలో ఇంతకన్నా ఘాటయిన ఉత్తరాలు, కబుర్లు వచ్చాయి.

శంకరం కనుచీకటి పడుతూ ఉండగా ఆ పల్లెటూరుకు చేరుకున్నాడు.

అల్లంతదూరాన్నే తనని చూచి వీధి అరుగుమీద కూర్చుని చుట్టకు నిప్పుపుల్ల అంటించబోతూ ఉన్న మేనమామ ఆ పని అర్ధాంతరంగా ఆపి—“ఎవరూ, శంకరమేనా!” అనడం—తనకు చాలా స్పష్టంగా వినిపించింది.

మేనమామ శంకరాన్ని కౌగలించుకున్నాడు.

అత్త కాళ్ళకు నీళ్ళు ఇచ్చింది.

పాలేరు స్నానానికి నీళ్ళు పెట్టాడు.

భోజనం అయినాక—ఆ కబురూ ఈ కబురూ చెబుతూ శంకరం నవారు మంచంమీద వీధి అరుగు పక్కన నడుం వాల్చి హాయిగా నిద్రలో పడిపోయినాడు.

ఇతనికి మెలుకువ వచ్చేసరికి ఇంకా పూర్తిగా తెల్లవార లేదు.

శంకరం పక్కమీద కూర్చున్నాడు.

ఎదురుగా విశాలమయిన బయలు.

ఎత్తున ఆకాశం

కనిపించీ కనిపించని నీలిరంగు.

ఆకాశం, భూమి కలుసుకునేచోట తెలుపు!

ఈ తెలుపు క్షణ క్షణానికి మారుతోంది.

చిక్కటి ఎర్రదనం పులుముకుంటూంది.

ఈ ఎర్రదనం అలుముకుంటున్న కొద్దీ ఆకాశం రంగు మారిపోతూంది.

గుండ్రటి కుంకుమ రంగు ముద్దబంతి పువ్వు దిశ్చక్రంలోనుంచి దూసుకు వస్తూంది.

శంకరానికి ఇదంతా అయోమయంగా ఉంది.

ఏమిటిది ?

సూర్యుడా, చంద్రుడా... నే నెక్కడ ఉన్నాను.... అనుకున్నాడు తనలో తను.

మేనమామ ఇంట్లోంచి బయటకు వచ్చాడు. తను పక్కమీద కూర్చుని ఉండడం చూచి ముసి ముసిగా నవ్వాడు.

"అప్పుడే ఉషస్సు వచ్చేసిందే" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

తను అలాగే ఆకాశం వంక చూస్తూ ఉండిపోయాడు, ఎంతో చిత్రం అనిపిస్తూంది అక్కడ జరుగుతున్న పరిణామం!

మనసుకు ఏదో చల్లదనం ఆవరించుకుంటూంది.

తన మనసంతా మెత్తగా దూదిపింజలా అయిపోయినట్లు అని పిస్తూంది.

తెల్లవారాక సూర్యుడు వెచ్చగా అనిపించేంత వరకూ అక్కడే అలాగే కూర్చుండి పోయాడు.

"బావకు పందుపుల్ల, వెండిచెంబుతో నీళ్ళు ఇచ్చిరామ్మా, పార్వతీ!" అని లోపలనుంచి ఒక గొంతు వినిపించింది.

శంకరం తల పక్కకు తిప్పి చూశాడు.

ఇందాక ఆకాశంలో కనిపించిన ముద్దబంతిపువ్వు వయ్యారంగా తన వంక నడిచి వస్తున్నట్లు అనిపించింది.

ఆశ్చర్యపోయి చూచాడు.

ఒకమారు దిగ్మండలం వంక, ఆ పైన ఈ పువ్వువంకచూచాడు.

పువ్వు కాదు.

అమ్మాయి!

ఆ అమ్మాయి తన పక్కగా, వెనకగా వెండిచెంబు ఉంచి భయం భయంగా తన ముఖం వంక చూచి, తనూ చూస్తున్నాడని గమనించడం తోటే వెనక్కు తుర్రున పారిపోయింది.

శంకరం దిగ్భ్రమ చెందాడు.

ఉషస్సు!

మేనమామ చెప్పిన ఉషస్సు.

తనకు ఈ ఉదయం సాక్షాత్కరించిన ఉషస్సు!

ఇంకా అది తన కళ్ళముందు ఆడుతున్నట్లే ఉంది! తన మనస్సులో మెదులుతూ ఉన్నట్లే ఉంది.

శంకరం మనస్సు దూదిపింజలా అయిపోయింది.

మూడుచేపల విషయం మరిచిపోయి హాయిగా నిట్టూర్చాడు. *

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)